క్లుప్తంగా

ఘనంగా పవిత్రాల సమర్పణ



నరసింహస్వామికి పవిత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం పవిత్రాల సమర్పణ కార్యక్రమం కన్నులపండుగగా సాగింది. కార్యక్రమంలో భాగంగా చివరిరోజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృత స్నాపన కార్యక్రమం నిర్వహించి స్వామికి పవిత్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీ నరసింహాచార్యులు, ఉదయగిరి వెంకట సుదర్శనాచార్యులు, ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం



అభిషేక పూజలో పాల్గొన్న ఈఓ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అభిషేక కార్యక్రమం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ పంచామృతాలతో స్వామి ఉత్సవమూర్తికి అభిషేకం గావించారు. అనంతరం మహానైవేద్యం సమర్పించి గ్రహణం సందర్భంగా ఆలయాన్ని మూసివేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పీసీపల్లి: మండల పరిధిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఒంగోలు విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి రాఘవరావు, ఈఓ శివనాగప్రసాద్ స్థానిక వెంకట్రామయ్య ఫెర్టిలైజర్స్ దుకాణంలో తనిఖీ చేశారు. యూరియా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. 10.2 టన్నుల డీఏపీ అమ్మకాలు నిలుపుదల చేశారు.

చెరువు వేలంపాట ఆదాయం రూ.2.82 లక్షలు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం దావగూడూరు చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయానికి సంబంధించిన చెరువు ఆయకట్టు భూములు 26.45 ఎకరాలకు వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో ఆలయానికి రూ.2,82,800 ఆదాయం వచ్చిందని గత సంవత్సరంతో పోలిస్తే రూ.5,300 అదనంగా వచ్చినట్లు ఈఓ సాంబశివరావు తెలిపారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

సీఎస్‌పురం(పామూరు): కార్మికులంతా ఐక్యంగా పోరాటాలు సాగించినప్పుడే సమస్యల పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి అన్నారు. సీఐటీయూ 5వ మండల మహాసభ సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ రఫియా అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా సీఐటీయూ జెండాను ఎగురవేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్.మాలకొండయ్య, సీనియర్ నాయకులు ఎస్.తిరుపతిరెడ్డి, జాకబ్, తిరుమలమ్మ, నాగమ్మ, పెద్దక్క, అనూరాధ, చల్లగాలి నిషా, ఖాజారసూల్, రామలింగయ్య పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల



ప్రత్యేక పూజలు చేస్తున్న వడ్డేపాలెం గ్రామస్తులు

పామూరు: మండల కేంద్రమైన పామూరు డీవీపాలెంలో గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పొంగళ్ల నైవేద్యం గాసమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పెద్ద అలవపాడు పంచాయతీ వడ్డెపాలెంలో పోలేరమ్మ తల్లి పొంగళ్లు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు కృష్ణ, శివయ్య, పరంధామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.



పోలేరమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

అధ్వాన రోడ్లు.. ఎన్నాళ్లీ అవస్థలు..!

- గుంతల రోడ్లలో నరకప్రాయంగా ప్రయాణం
- రోడ్ల మరమ్మతులను పట్టించుకోని ప్రభుత్వం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



గుంతలమయంగా పీసీపల్లి రహదారి



మెటల్ రోడ్డును తలపిస్తున్న తలకొండపాడు రోడ్డు

పీసీపల్లి:

మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్లు, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ఆ రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి ప్రభుత్వం గత ఏడాదిలో జనవరి నాటికల్లా రోడ్లను అద్దాల్లా మారుస్తామంటూ ఆర్భాటపు ప్రగల్భాలు పలికింది. కానీ జనవరి దాటి సెప్టెంబర్ వరకు ఇప్పటి వరకు రోడ్ల అభివృద్ధి గురించి, మరమ్మతుల గురించి గానీ పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత చొప్పున మొత్తం రోడ్డు అధ్వానంగా తయారైనా కనీసం మరమ్మతులు చేసే వారే కరువయ్యారు. ప్రజాప్రతినిధులు గానీ అధికారులు గానీ రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు.

ఇదీ పరిస్థితి.

మండల పరిధిలోని పెద్ద అలవలపాడు నుంచి కంభాలదిన్నె వరకు ఆర్అండ్‌బీ రోడ్డు సుమారు 40 కిలోమీటర్లు, పీసీపల్లి నుంచి కంచర్లవారిపల్లి అడ్డరోడ్డు వరకు సుమారు 15 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రహదారిలో ప్రయాణమంటే ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అదే విధంగా కనిగిరి నుంచి అజీస్‌పురం, బట్టుపల్లి మీదుగా పీసీపల్లికి వచ్చే 11 కిలోమీటర్ల పంచాయతీ రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గుంతలతో ద్విచక్రవాహనంపై వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. అతుకులు వేసిన ప్రాంతంలోనే మళ్లీ అతుకులు వేయడంతో రోడ్డంగా అతుకుల బొంతలాగా తయారైంది. చిన్న మరమ్మతులు చేసే కాంట్రాక్టర్లు నాసికరంగా వేయడంవల్ల అతుకులు వేసిన నాలుగు రోజులకే మళ్లీ అధ్వానంగా తయారవుతున్నాయి. మరమ్మతు పనుల్లో నాణ్యత ప్రమాణాలను గాలికొదిలేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాధనం వృథా అవుతుంది తప్ప ప్రయాణికుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఈ రోడ్లన్నీ అధ్వానంగా మారడంతో చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్లపై ప్రయాణమంటేనే ద్విచక్రవాహనదారులు భయపడుతున్నారు. ఆటోలు, బస్సుల్లో వెళ్లాలన్నా నరకప్రాయంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి:



అంతర్గత రోడ్లు దేవుడెరుగు కనీసం మండలానికి వచ్చే ప్రధాన రహదారి కూడా గుంతలమయంగా మారింది. అడుగుకో గుంతతో ఇబ్బందులు పడుతున్నాం. తక్షణం రోడ్లకు మరమ్మతులు చేసి మా ఇక్కట్లు తీర్చాలి.

వేమూరి సుబ్బారావు, కమ్మవారిపల్లి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం:



కనిగిరి మండలం కంచర్లవారిపల్లి నుంచి తలకొండపాడు మీదుగా పీసీపల్లి వచ్చే ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో మా కష్టాలు చెప్పేవీ కావు. ఇటీవల గుంతల్లో పడి ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. కనీసం మరమ్మతులైనా చేయండి

దేవదాసు, తలకొండపాడు ఎస్సీ కాలనీ

రైతుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు, ఇతర నేతలు



సింగరాయకొండలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు



జరుగుమల్లి మండల కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం



మద్దిపూడిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు



పొన్నలూరులో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు



టంగుటూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హరిబాబు, నేతలు

- అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కొండపి: రైతులకు సకాలంలో ఎరువులు అందించకుండా ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎరువుల కోసం రైతులు అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటలకొద్దీ క్యూ లైన్‌లో నిలబడినా ఒక బస్తా ఎరువు కూడా దొరకడం గగనంగా మారిందన్నారు. పంటను దక్కించుకునేందుకు రైతులు ఎంతో ఆరాటపడుతున్నా ప్రభుత్వం నుంచి ఏ మాత్రం సహాయం అందడం లేదని విమర్శించారు. యూరియా సహా రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఎరువులను పక్కదోవ పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ అనే కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈనెల తొమ్మిదిన ఒంగోలులోని ఆర్డీఓ ఆఫీస్ వద్ద జరిగే అన్నదాత పోరులో మండలంలోని ప్రతి ఒక్క అన్నదాత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇంటలెక్చువల్ అధ్యక్షుడు సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు యామవరపు వీర వసంతరావు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు సుల్తాన్, రామయ్య, పల్లె శివరాం, వినోద్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ఎరువుల కొరతతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అన్నదాతకు మద్దతుగా నిలవాలని పార్టీ శ్రేణులు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో అన్నదాత పోరు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల ఎరువులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని, బ్లాక్‌మార్కెట్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు చొప్పర వెంకన్న, రాపూరి ప్రభావతి, సుదర్శి వెంకట్రావు, చుక్కా కిరణ్‌కుమార్, యనమల మాధవి, గొల్లపోతు గోవర్దన్, కోమిట్ల వెంకారెడ్డి, షేక్ కరీం, పెరికాల సునీల్, సయ్యద్ ఆబిద్‌ఆలీ, షేక్ నౌషాద్, షేక్ అల్లాభక్షు, కేశవరపు కృష్ణారెడ్డి, మిరియం సుధాకర్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ, పాలూరి శ్రీనివాసులరెడ్డి, షేక్ రహీం, షేక్ అల్లా, షేక్ అల్లాఉద్దీన్, నరేష్, నాగార్జునరెడ్డి, భాను, షేక్ అబ్దుల్లా, షేక్ మస్తాన్, పాల్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టనున్న అన్నదాత పోరు వాల్‌పోస్టర్లను ఆదివారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాసులు, ఉప సర్పంచ్ దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దిపూడి: ఎరువుల కోసం రైతన్నలు పడుతున్న అగచాట్లపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిర్వహించే అన్నదాత పోరును విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ ఇనకొల్లు సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి స్థానిక రాములవారి గుడి వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు దారుకుమల్లి గోవిందరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు బసిరెడ్డి, సూరే నరసింహారెడ్డి, సన్నపరెడ్డి పెద్దిరెడ్డి, వాకా వీరనాయణరెడ్డి, ఇనుకొల్లు వెంకారెడ్డి, కొండూరి చెంచిరెడ్డి, ఉప్పుగల్లు ఒంకారం, ఇనుకొల్లు శేషిరెడ్డి, ఇండ్లా నరసింహ, మారెడ్డి నరేంద్ర, కొండూరి సుధాకర్‌రెడ్డి, సూరే రామిరెడ్డి, దేవరపల్లి కృష్ణారెడ్డి, దేవరపల్లి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పొన్నలూరు: రైతుల సమస్యలపై ఈ నెల 9న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఒంగోలులో చేపట్టనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జున పిలుపునిచ్చారు. ఆదివారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, రాష్ట్ర ఆర్టీఐ విభాగం కార్యదర్శి పిల్లి తిరుపతిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గడ్డం మాల్యాద్రి, కాటా మల్లికార్జున, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొడపేరు విజయ్, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు పిల్లి జీవన్‌కుమార్, ఐటీ వింగ్ అధ్యక్షుడు యర్రా రామకృష్ణ, పచ్చవ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: రైతుల సమస్యలపై ఈ నెల 9న ఒంగోలులో తలపెట్టిన అన్నదాత పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు పిలుపునిచ్చారు. స్థానికంగా నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మండల ఉపాధ్యక్షుడు పులిచర్ల కోటయ్య, యువజన విభాగం అధ్యక్షుడు దేవరపల్లి వరుణ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పేరూర్ కమలాకర్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చింతం చైతన్యరెడ్డి, కొమ్ము సురేంద్ర, దేశిరెడ్డి, యాసిన్, సుమన్, రోషన్, షబ్బీర్ పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత



మూసివేసిన వల్లూరమ్మ ఆలయం



మూసివేసిన నారాయణస్వామి ఆలయం

టంగుటూరు: చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు తలుపులు మూసివేసినట్లు ఆలయ ఈఓ రమేష్ తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 6 గంటలకు సంప్రోక్షణ అనంతరం యధాప్రకారం భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.

సింగరాయకొండ: చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఆలయాలు మూసివేస్తున్నట్లు ఆలయ ఈఓలు తెలిపారు.

పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి దేవస్థానం, దావగూడూరులోని చెన్నకేశవస్వామి దేవాలయాలను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 6 గంటలకు ఆలయాల్లో సంప్రోక్షణ నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు.



తలుపులు మూసిన పాతసింగరాయకొండ వరాహలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

ఏచూరి స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిద్దాం



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కొండపి: మతసామరస్యం కోసం, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం సీతారాం ఏచూరి చేసిన కృషిని స్ఫూర్తిగా తీసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు ఉద్యమిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు అన్నారు. మిట్టపాలెంలో ఆదివారం జరిగిన ఏచూరి ప్రథమ వర్ధంతి సభకు గ్రామ శాఖ కార్యదర్శి లక్కేపోగు సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో నాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఎదిరించి విద్యార్థి సమస్యలు పరిష్కరించడంలో ఏచూరి సమరశీలమైన పాత్ర పోషించారన్నారు. లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, సోషలిజం సాధించేందుకు కృషి చేయటమే ఏచూరికి అర్పించే నివాళి అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్, జి. వందనం, అంకయ్య, ఆదాం, గోపి, సురేష్, ఎస్తేరమ్మ, నవీన్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, విమల, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరును జయప్రదం చేయండి



వాల్ పోస్టర్ ఆవిష్కరణలో దద్దాల నారాయణ యాదవ్, బన్నీ, తిరుపతిరెడ్డి

- యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం
- పంటలకు దక్కని గిట్టుబాటు ధర
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 9న అన్నదాత పోరు
- పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: రైతన్నలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 9న నిర్వహించే అన్నదాత పోరులో పార్టీ నేతలు, రైతులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో అన్నదాతలు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోందని, రైతులు బస్తా ఎరువు కోసం క్యూలో నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. రైతులకు చెందాల్సిన యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్నారని తీవ్రంగా మండిపడ్డారు. రైతుల సమస్యలపై స్పందించాల్సిన వ్యవసాయ శాఖ మంత్రి రైతుల పట్ల చులకన భావంతో మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఆర్బీకేల ద్వారా యూరియా, ఎరువులను రైతులకు ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టి వల్ల రూ.270అమ్మాల్సిన యూరియా బస్తా, రూ.300 నుంచి రూ 500లకు అమ్ముతు నిలువు దోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించినా ఏమాత్రం కూటమి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో పొగాకు, మిర్చి, వరి వంటి పంటలకు మద్దతు ధర లేదని, రైతాంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. రైతులకు యూరియా, అన్ని రకాల ఎరువులను సరఫరా చేయాలని, ఎరువులు, యూరియా బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని, ఉచిత పంటల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అందరికి వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, ఒకేరెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, జి.బొర్రారెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఎస్కే రసూల్, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, కటికల వెంకట రత్నం, జి.ఆదినారాయణరెడ్డి, పోలక సిద్ధారెడ్డి, ఏ నాగమణి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, మందాది కృష్ణారెడ్డి, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, చింతంగుంట్ల కిషోర్, ఎస్కే రహీం, రామనబోయిన శ్రీను, పలుకూరి భాస్కర్, మేకల మాల్యాద్రి, ఫణికుమార్, మూలే గోపాల్‌రెడ్డి, సాంబిరెడ్డి, ఎస్కే షకీలా, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీ శ్రీనివాసరావుకు సన్మానం



ఏఎస్పీ శ్రీనివాసరావుకు మొక్క అందజేస్తున్న చిన్ననాటి స్నేహితులు

సింగరాయకొండ: జిల్లా అడిషనల్ ఎస్పీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొల్లూరి శ్రీనివాసరావును ఆదివారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో సింగరాయకొండకు చెందిన చిన్ననాటి స్నేహితులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు. స్నేహితులు పీబీ చంద్రశేఖర్, పబ్బిసెట్టి సుధాకర్, మునగనూరి సుబ్బారావు, షేక్ ఖలీల్, గోపీ, గొల్ల సురేష్, పద్మనాభుని సురేష్ పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పిరమిడ్ సీనియర్ మాస్టర్స్ జి.రమణయ్య, తిరుపతి రెడ్డి అన్నారు. స్థానిక పత్రిసాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో ఆదివారం సాయంత్రం పౌర్ణమి ధ్యాన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం వల్ల ఉపయోగాలు వివరించారు. హైమావతి, అనసూయ, సౌభాగ్యం, అల్లూరరయ్య, శ్రీనివాసులు, ధ్యాన పరులు పాల్గొన్నారు.

కారు, మోటారుసైకిల్ ఢీ



క్షతగాత్రులను హైవే అంబులెన్స్ లో తరలిస్తున్న దృశ్యం

సింగరాయకొండ: కారు, మోటారుసైకిల్ ఢీకొన్న ప్రమాదంలో మోటారుసైకిలిస్టు శంకరయ్య, అతని మరదలు నాగేంద్రంకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని కందుకూరు ఫ్లెటైవర్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం నెల్లూరు జిల్లా కందుకూరులోని జనార్ధనపురంలో నివసిస్తున్న శంకరయ్య, అతని మరదలు నాగేంద్రం వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహంతో పాటు మోటారుసైకిల్‌పై వెళ్లి పాకల బీచ్‌లో నిమజ్జనం చేసి తిరుగుప్రయాణంలో వస్తుండగా కందుకూరు ఫ్లెటైవర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు మోటారుసైకిల్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హైవే అంబులెన్స్ లో కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పీసీపల్లి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థుల యోగా విన్యాసాలు

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాల చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలలో ప్రతిభ కనబరిచారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలోని ద్వారకాతిరుమల్లో ఈ నెల 6 , 7 తేదీల్లో జరిగిన యోగా పోటీలలో వెంగలాయపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఈఓలు శ్రీనివాసచారి, సంజీవ్‌లు అభినందించారు.

వెంకటేష్ మృతి పార్టీకి తీరని లోటు



వెంకటేష్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు, నాయకులు

పామూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ (34) మృతి పార్టీకి తీరని లోటని పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, ఎంపీపీ, మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి జోనల్ ప్రెసిడెంట్ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకటేష్ శనివారం రాత్రి లివర్ సంబంధిత అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా ఆదివారం మృతుని నివాసానికి వెళ్లి మృతుని భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని తల్లి పద్మ, తండ్రి తిరిపాలును పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సెంట్రింగ్ చాంద్‌బాషా, కల్లూరి రామిరెడ్డి, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరామ్ శ్రీనివాసులు, గాయకవాడ సుభాషిణి, పందిటి వెంకటలక్ష్మి, షేక్.రసూల్, కాలేషా, మీరామొహిద్దీన్ నివాళులర్పించారు.

కరోనా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కనిగిరిరూరల్: మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం చీయద్రి ఆనంద్ అధ్యక్షతన మున్సిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీ కేశవరావు మాట్లాడుతూ కరోనా కార్మికులను పనిలో నుంచి తొలగించవద్దని, వారందరినీ ఆప్కాస్‌లో చేర్పించాలని, కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సీహెచ్ ప్రసాద్, కార్యదర్శిగా సీహెచ్ ఆనంద్, ఉపాధ్యక్షులుగా జె.చార్లెస్, సహాయ కార్యదర్శిగా రమణయ్యగా, ట్రెజరర్‌గా లక్ష్మయ్య, సభ్యులను ఎన్నుకున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. జాతీయ పౌష్టిక ఆహార వారోత్సవాలు ఆదివారం స్థానిక ప్రభుత్వ సమీకృత బాలికల వసతి గృహంలో వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వసతి గృహ సంక్షేమ అధికారి చంద్ర కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ పోషకాహారలోపాన్ని తగ్గించడం, ఆరోగ్యకరమైన అలవాట్లను ప్రోత్సహించడమే వారోత్సవాల ఉద్దేశమన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్ బాబు, జి.నవకుమార్, విజేత విద్యా సంస్థల అధినేత పి. అరుణోధర్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.